తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

సంపుటి: 1 సంచిక: 49 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ బుధవారం 18 -09-2024 వెల: 5/రూ -




# అమ్మేదే కల్తీ కల్లు, నడి ఊళ్లో!

## కల్లు విక్రయ కేంద్రాలు గ్రామాల బయటనే ఉండాలి...

## జనావాసాల మధ్యలో కాదు

## ఎక్సయిజ్ శాఖ వెంబటే స్పందించాలి



2లో



ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాలలోతెల్ల కల్లు కల్తీ చేస్తూ అమ్ము తున్నది. ఓపెన్ సీక్రెట్ అందరికి తెలిసిన విషయమే. ఒక్కక్క మండలం లో ఈత చెట్లు గానీ తాటి చెట్లు గానీ ఎన్ని ఉన్నప్పటికీ 10 నుంచి 15 లీటర్లు వరకు మాత్రమే నిక్కచ్చి తెల్ల కల్లు చెట్ల నుంచి లభిస్తుంది.తెల్ల కల్లు కల్తీని నిరోధించుటలో సంబంధం గల శాఖ నిఘా కరువు అయినట్లు కన్పిస్తోంది. నాయకుల అండదండలు కల్గి తెల్ల కల్లును కల్తీ చేసి వ్యాపారులు అధిక లాభాలు గడిస్తున్నారు.

అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో: ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాలలోతెల్ల కల్లు కల్తీ చేస్తూ అమ్ము తున్నది. ఓపెన్ సీక్రెట్ అందరికి తెలిసిన విషయమే. ఒక్కక్క మండలం లో ఈత చెట్లు గానీ తాటి చెట్లు గానీ ఎన్ని ఉన్నప్పటికీ 10 నుంచి 15 లీటర్లు వరకు మాత్రమే నిక్కచ్చి తెల్ల కల్లు చెట్ల నుంచి లభిస్తుంది.తెల్ల కల్లు కల్తీని నిరోధించుటలో సంబంధం గల శాఖ నిఘా కరువు అయినట్లు కన్పిస్తోంది. నాయకుల అండదండలు కల్గి తెల్ల కల్లును కల్తీ చేసి వ్యాపారులు అధిక లాభాలు గడిస్తున్నారు. ఈ కల్తీ వ్యాపారం కు అడ్డు వచ్చిన వారికి ముడుపులు ముట్టచెప్పి యాతేచ్ఛగా వ్యాపారం కొనస్తున్నట్లు విమర్శలు జోరుగా వస్తున్నాయి. అయితే ఈ కల్తీ కల్లుతో కొంతమందికి మాత్రమే లాభం ఒక 10%మంది అని చెప్పవచ్చు. అందులో నాయకులు కావచ్చు, అధికారులు కావచ్చు, అల్లాటప్ప గాళ్లు కూడా ఉండవచ్చు.90%మంది మాత్రం ఈ తెల్ల కల్లు సేవనం తో కుటుంబాలకు కుటుంబాలు నాశనం అవుతున్నాయి. తెల్ల కల్లుకు బానిస అయిన వ్యక్తికీ అది లేకుంటే నరవదు. అతను ఇంటికి పరిమితం అయి త్రిశంకు స్వర్గం లో తేలియాడుతుంటాడు. ఇంట్ల భార్య పిల్లల మాట వినడు. అతని ఆరోగ్యం దినదినం క్షిణించి పోయిన పట్టించుకోడు. బద్ధకస్తుడు అయి పని పాట లేకుండా కీల్లు, కాళ్లు వదులుగా మారిన కల్లు తాగటం మనాడు. ప్రతీ గ్రామంలో కనీసం 2 తెల్ల కల్లు బట్టీలు ముడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిళ్ళుతుంటాయి.ఇంత జనానికి ప్రాణ నష్టం, ఆస్తులు నష్టాలు జరుగుతున్న వాటిని అదుపులో ఉంచే ఎక్సయిజ్ శాఖ నిమ్మకు నీరేతినట్లు ఉంటోందని ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి. మందు బాబులు వదలి పెట్టిన సీసాలలో ఈ మత్తు కల్లు ను ఎక్కడో రహస్యంగా తయారు చేసి కల్లు డిపోలోకి తరలిస్తుంటారు. ఎక్సయిజ్ అధికారులు



# గణనాథుడికి ఘన వీడ్కోలు

- ఆధ్యాత్మిక సంద్రమైన భాగ్యనగరం
- విభిన్న రూపాల గణపయ్యలతో కనులపండువగా నిమజ్జనోత్సవం
- వైభవంగా ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్ర
- సీఎం పర్యటనతో గంటపాటు ఆగిన యాత్ర
- మహా ఘట్టాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన అశేష భక్తజనం
- కిక్కిరిసిన ఎన్టీఆర్ మార్గ్..తోపులాటలు..లాఠీచార్జీ
- మధ్యాహ్నం 1.37 గంటలకు గంగమ్మ ఒడికి మహాగణపతి
- సాయంత్రం 4.30కి బాలాపూర్ గణేశుడి నిమజ్జనం
- రూ. 30 లక్షలకు లడ్డూను దక్కించుకున్న శంకర్‌రెడ్డి
- ట్రై కమిషనరేట్ల పరిధిలో లక్షకు పైగా విగ్రహాల నిమజ్జనం
- నేడూ నిమజ్జన ప్రక్రియ కొనసాగే అవకాశం

2లో

# ఈ టర్మ్‌లోనే జమిలి ఎన్నికలు

## వక్ఫ్ బిల్లుకు త్వరలో ఆమోదం

## మోదీ 3.0 వంద రోజుల పాలన విజయాలపై మాట్లాడిన హోంమంత్రి అమిత్ షా




# ఫాంహౌస్ సీఎంను కాను..

## నేను పనిచేసే ముఖ్యమంత్రిని: రేవంత్‌రెడ్డి

## పన్నుల రూపంలో వేలకోట్లు కేంద్రానికి కడుతున్నాం

## రాష్ట్రం హక్కుగా రావాల్సిన వాటా కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీకి వెళ్తా

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ



హైదరాబాద్: 'నా ఢిల్లీ పర్యటనల మీద విమర్శలు చేస్తున్నారు. కాలు కదపకుండా ఇంట్లో సేద తీరడానికి నేనేమీ ఫాంహౌస్ సీఎంను కాదు. పని చేసే ముఖ్యమంత్రిని. నా స్వార్థం కోసమో, వ్యక్తిగత పనుల కోసమో నేను ఢిల్లీకి వెళ్లడం లేదు. ఢిల్లీ ఏ పాకిస్తాన్‌లోనో, బంగ్లాదేశ్‌లోనో లేదు. అది మన దేశ రాజధాని. ఇది ఫెడరల్ వ్యవస్థ. రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య అనేక అంశాలుంటాయి. రాష్ట్రం నుండి మనం పన్నుల రూపంలో కొన్ని వేల కోట్లు కడుతున్నాం.

2లో



# నైట్ షిఫ్టులు వద్దంటారా?

- మహిళా డాక్టర్ల కెరీర్ దెబ్బ తినదా?
- మమత సర్కారుకు సుప్రీం ప్రశ్న
- అలా చెప్పే అధికారం మీకు లేదు
- వారికి భద్రత కల్పించడం మీ బాధ్యత
- పైలట్లు, సైనికులుగా నైట్‌షిఫ్టులు చేయట్లేదా?
- ప్రభుత్వాన్ని మందలించిన సీజేఐ ధర్మాసనం
- విచారణ ప్రత్యక్ష ప్రసారం నిలిపివేతకు నిరాకరణ
- ఏం జరుగుతోందో ప్రజలకు తెలియాలని వ్యాఖ్య

న్యూఢిల్లీ: మహిళా వైద్యులు నైట్ డ్యూటీలు చేయొద్దన్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్దేశాలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. అలా చెప్పే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసింది.


2లో

# ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ

## ఆప్ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవం..ఢిల్లీకి యంగెస్ట్ సీఎంగా రికార్డు

## 26 లేదా 27న ఆతిశీ ప్రమాణం.. పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ,: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. తన మంత్రివర్గ సహచరులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలుసుకున్న కేజ్రీవాల్ తన రాజీనామా పత్రాన్ని అందించారు. కేజ్రీవాల్ స్థానంలో ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిశీని పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ నెల 26 లేదా 27న ఆమె సీఎంగా ప్రమాణం చేయనున్నట్టు సమాచారం.



# వరద బాధితులకు ప్రభుత్వ సాయమేది?: బొత్స



2లో

# అప్పులే చెబుతారా..? అభివృద్ధి లేదా..?

## సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు ధ్వజం

# అమ్మేదే కల్తీ కల్లు,నడి ఊళ్ళో!





(మొదటి పేజీ తరువాయి)

ఈ డిపోల మీద కల్సి చేస్తున్న ప్రదేశాలు కనిపెట్టి దాడులు జరిపి పేద కుటుంబాలను కాపాడే బాధ్యత గట్టిగా నిర్వర్తించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఒరిజినల్ చెట్ల నుంచి తీసిన కల్లు కిడ్నీ లోని రాళ్ళు తొలగించి వేయుటకు ఉపయోగం అంటారు. కల్తీ మూలాన చెడు చేసి రసాయనాలు అనారోగ్యం పాలుచేస్తున్న తాగుడు మాత్రం మానరు.అయితే ఈ ఒరిజినల్ కల్లు కావాల్సిన వారికీ ఎక్కువ మొత్తంలో అమ్మికొంటారు. ఒరిజినల్ తెల్ల కల్లు రుచి ఏవిదంగా ఉంటుంది అంటే కొబ్బరి బొండాంలోని కొబ్బరి నీళ్లు సేవించినట్లు ఉంటుందని కల్లు సేవించే పెద్దలు చెప్తుంటారు.

**కానీ తెల్ల కల్లు దుకాణపోళ్ళు**

కల్తీ చేసి వందల లీటర్లు తయారును ఎక్కడో ఒక చోట రహస్య ప్రదేశంలో తయారు చేసి ఖాళీ అయిన బీరు సీసాలలో నింపి వాహనాల ద్వారా పర్మిషన్ పొందిన దుకాణంలకు తరలించి అమ్ముతారు. ఈ కల్తీ కల్లులో, ఆల్ఫా జోలం డైజోఫామ్, గ్లోజోఫామ్,క్లోరో హైడ్రెట్,బ్లీచింగ్ పౌడర్,అనే మత్తు పదార్తలు కల్పి యువకులను నిషలో ముంచేత్తున్నారు. ఈ మత్తు పదార్తలలో ఏవి చౌక ధరకు లభిస్తే వాటిని ఉపయోగిస్తున్నారు.నురగకోసం కుంకుమ కాయల రసం, యూరియా లాంటివి కల్పడం, తియ్యగా మారుటకు సాక్రీన్ ను కల్పి అమ్ముతున్నారు.ఈ విదంగా ఆదిలాబాద్ జిల్లా లో పలు మండలంలో ను బోథ్ నియోజకవర్గం లోని బజార్ హత్నూర్, ఇచ్చోడ, బోథ్, గుడి హత్నూర్, సిరికొండ,తదితర మండలంలలో జోరుగానే కొనసాగుతోంది.ఏజెన్సీ గ్రామాలలో అయితే మరీ ఎక్కువగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. తెల్ల కల్లు దుకాణంలు కల్లు గీత గీయ వచ్చిన కార్మికులకు మాత్రమే ఇవ్వాలి. కానీ కుత్రిమంగా కల్లును తయారు చేసిన వారికి లభిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో అమ్మే తెల్ల డిపోలకు ఎక్కడో నిర్మల్, ఖానాపూర్, బాల్కొండ, దిలావల్పూర్ తదితర దూర ప్రాంతంల నుంచి సరఫరా అవుతున్నట్లు ఆరోపణలు వినిపించాయి. స్టాక్ లేని పక్షంలో స్థానికంగా కూడా కుత్రిమ కల్లు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీలుపోసి తయారు చేస్తారని తెలుస్తోంది. ఏది ఏమైనా గీత కార్మికులు లేని, కల్లు తయారు అయ్యే చెట్ల పెంపకం లేని ఈ ప్రాంతంలో ఇంత పెద్ద కల్లు అమ్ముడు పోవడం చర్చనీయాంశంగా మారింది.

**జనులు నివాసాలు ఉండే గృహాల పక్కన కల్లు సేవనం కేంద్రాలు**

కల్లు సేవనం కేంద్రాలు ప్రజలు నివాసం ఉండే ఇళ్లకు దూరంగా గ్రామాలకు బయట ప్రదేశంలో ఉండాలి. ఇలాంటి కేంద్రాలు గ్రామం లోపల ఉండుట కారణంగా కల్లు తాగిన వ్యక్తులకు ముందు వెనుక ఏమి కనిపించదు. సిగ్గు శరం అస్సలు ఉండదు. వారి కల్లు సేవించి నివాస గృహల ముందర మూత్ర విసర్జన చేయటం ఇంకేవైన పిచ్చి చేష్టలు చేసి గృహినులకు, చదువుకొనే పిల్లలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని కల్లు అమ్మే కేంద్రం సమీపంలో గల గృహనివాసులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి గ్రామాల మధ్య ఉన్న కల్లు సేవన కేంద్రంలను గ్రామం బయటిప్రదేశంకుతరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఏదో ఒక రోజు మేమంతా సామూహికంగా తెల్ల కల్లు విక్రయ కేంద్రం మీద దాడి కి దిగాల్సి ఉంటుంది అని తెలిపారు. ఆ పరిస్థితి రాకముందే సంబంధం గల ఎక్సయిజ్ అధికారులు గానీ, ఇతర శాఖల అధికారులు గానీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. లేదా కల్లు విక్రయ కేంద్రం వారే రాబోయే పరిస్థితి నుంచి బయటకు వెళ్లే మార్గం వెతుకుతే బాగుంటుంది అనే అభిప్రాయంలు వ్యక్తం అవుతున్నవి.

# గణనాథుడికి ఘన వీడ్కోలు

నేడు సైతం నిమజ్జన ప్రక్రియ కొనసాగే అవకాశమున్నది. నగరంలో గణనాథుడి నిమజ్జనోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రతో ఆధ్యాత్మికత సంతరించుకున్నది. ఉదయం నుంచే మండపాల వద్ద పూజలు నిర్వహించి.. గణనాథుడి విగ్రహాలను రథంపై ఊరేగించి.. హుస్సేన్ సాగర్, సరూర్‌నగర్, సఫిల్‌గూడ, కూకట్‌పల్లి తదితర చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల్లో కిలోమీటర్ల పొడవునా..విభిన్న రూపాల గణనాథులు బారులు తీరాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర వైభవంగా సాగింది. ఉదయం 6.32 నిమిషాలకు ప్రారంభమై..సుమారు ఎనిమిది గంటల పాటు కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పర్యటించిన సందర్భంగా గంట వరకు శోభాయాత్ర నిలిపివేయడంతో ట్యాంక్‌బండ్‌పైకి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం11.46 గంటలకు ఎన్టీఆర్‌మార్గ్‌లోని క్రేన్ నం. 4 వద్దకు మహాగణపతి చేరుకోగా, తుది పూజల అనంతరం మధ్యాహ్నం 1.37 గంటలకు నిమజ్జనం చేయడంతో 'మహా' ఘట్టం ముగిసింది. ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేయడమే లక్ష్యంగా ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలో 35 వేల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనాన్ని త్వరగా పూర్తి చేయించేందుకు పోలీసులు నిర్వాహకులపై ఒత్తిడి తీసుకొచ్చారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల నుంచి అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్లు స్వయంగా పర్యటించారు. బాలాపూర్ గణేశుడిని వేగంగా నిమజ్జనం చేయించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. మధ్యాహ్నం 2 గంటల వరకే అఫ్జల్‌గంజ్ ప్రాంతానికి చేరుకుందంటే.. వాహనాన్ని ఎంత వేగంగా తరలించారనేది అర్థమవుతున్నది. అలాగే ఖైరతాబాద్ గణేశుడిని సైతం నిర్దిష్ట సమయానికే నిమజ్జనం చేయించారు. బాలాపూర్ గణపతికి ఉదయం 5.30 గంటలకు గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు ప్రత్యేక పూజలు చేసి.. నిమజ్జన యాత్రను ప్రారంభించారు.

# ఫాంహౌస్ సీఎంను కాను..

(మొదటి పేజీ తరువాయి)

అందులో హక్కుగా రావాల్సిన మన వాటాను తిరిగి తెచ్చుకోవడం కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళతా..'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. 'ఓ నిజాము పిశాచమా... కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని..'అంటూ దాశరథి కృష్ణమాచార్య రాసిన కవితతో సీఎం తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'తెలంగాణ ప్రజల మధ్య ఐక్యతను, సమైక్యతను దెబ్బతీసే విధంగా సెప్టెంబర్ 17ను కొందరు వివాదాస్పదం చేయడం క్షమించరాని విషయం. నిరంకుశ నిజాం రాజు, ఆనాటి రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగానే పోరాటం జరిగింది కాని ఒక ప్రాంతానికో, ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా కాదు. రాజకీయ ప్రయోజన కోణంలో దీనిని చూడటం అవివేకం. విలీనం అని ఒకరు, విమోచనం అని ఒకరు స్వప్రయోజనాల కోసం నాటి అమరుల త్యాగాలను పలుచన చేసేలా ప్రవర్తించడం సరికాదు. అందుకే ఈ శుభదినానికి ప్రజా పాలన దినోత్సవంగా నామకరణం చేశాం. పెత్తందార్లపై, నియంతలపై ఈ పిడికిలి ఎప్పటికీ పోరాట సంకేతంగా ఉండాలి. తెలంగాణ అస్తిత్వం అంటే తమ కుటుంబ అస్తిత్వం, సంస్కృతి అని గత పాలకులు భావించారు. తెలంగాణ గుండె చప్పుడు తెలిసిన వాడిగా నేను అధికారంలోకి రాగానే సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికా..'అని రేవంత్ చెప్పారు. 'గత పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు. ప్రతి నెలా అసలు, వడ్డీ కలిపి రూ.6 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితుల్లో మేం బాధ్యతలు స్వీకరించాం. కేంద్రం నుంచి మన హక్కుగా రావాల్సిన ప్రతి పైసా తెచ్చుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. భేషజాలకు పోకుండా నేనే స్వయంగా పలుసార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులందరినీ కలిసి, వినతిపత్రాలు ఇస్తున్నా. లేక్ సిటీగా పేరొందిన హైదరాబాద్ గత పాలకుల పాపంతో ఫ్లడ్స్ సిటీగా దిగజారింది. చెరువులు, నాలాలు కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. కొందరు భూ మాఫియాగాళ్లు పేదలను ముందు పెట్టి హైడ్రా లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హైడ్రా ఆగదు..'అని సీఎం స్పష్టం చేశారు. 'మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి నిరుద్యోగుల్లో ఆశలు చిగురింపజేశాం. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నాం. సంక్షేమంలో మా పార్టీ రికార్డులను మేమే తిరగ రాస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో ఏక కాలంలో రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశాం. 22 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేశాం. 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం రూ.282 కోట్ల సబ్సిడీని, 49 లక్షల కుటుంబాలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌కు రూ.965 కోట్ల సబ్సిడీని చెల్లించాం.

# నైట్ షిఫ్టులు వద్దంటారా?

"పైలట్లుగా, సైనికులుగా మహిళలు రాత్రి విధులు నిర్వహించడం లేదా? మీ నిర్దేశాలు మహిళా వైద్యుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయి. రాత్రి విధుల్లో సమస్యలు ఎదుర్కోకుండా వారికి అవసరమైన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అంతే తప్ప వాటిని మానుకోవాలని చెప్పడం సరికాదు" అంటూ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం మందలించింది. దాంతో సదరు నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటామని బెంగాల్ సర్కారు విన్నవించింది. కోల్‌కతాలో ఆర్‌జీ కర్ ప్రభుత్వాసుపత్రిలో ట్రైనీ వైద్యురాలు రాత్రి విధుల్లో ఉండగా హత్యాచారానికి గురవడం, ఈ ఉదంతం దేశవ్యాప్త ఆందోళనలకు దారితీయడం తెలిసిందే. దాంతో నెల రోజులకు పైగా మమత సర్కారు ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ నేపథ్యంలో మహిళా వైద్యుల భద్రత నిమిత్తం సలహాలు, సూచనలతో 'రాతిరేర్ సాథి' పేరిట ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది.

# మద్యం అమ్మకాల్లో తగ్గేదే లే!

అమరావతి: పొరుగు రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఆదాయం తగ్గకుండా ఉండేలా కొత్త మద్యం విధానం ఉంటుందని మంత్రివర్గ ఉప సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ఇక నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని ప్రవేశ పెడతామని తెలిపింది. కొత్త మద్యం విధానాన్ని రూపొందించేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్‌లు మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. తమ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక గురించి ఆయునతో చర్చించారు. కొత్త మద్యం విధానంలో చేర్చాల్సిన పలు అంశాలను సీఎం వారికి సూచించారు. కొత్త మద్యం విధానంపై రూపొందించిన నివేదికను బుధవారం నిర్వహించనున్న రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించాలని నిర్ణయించారు.

# అప్పులే చెబుతారా..? అభివృద్ధి లేదా..?

(మొదటి పేజీ తరువాయి)

మెదక్: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రస్తావించకుండా అప్పుల గురించి పదేపదే మాట్లా డుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నారని ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. 16వ ఆర్థిక సంఘం ముందు మళ్లీ అవే అబద్ధాలను వల్లెవేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని, ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు స్వయంగా ముఖ్యమంత్రి పదే పదే మాట్లాడటం రాష్ట్ర భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేయడమేనని పేర్కొన్నారు. రూ.6.85 లక్షల కోట్ల అప్పుందనే తప్పుడు ప్రచారాన్ని ఇంకెన్ని రోజులు చేస్తారని హరీశ్ ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి, మూలధన పెట్టుబడి, సంక్షేమాల కోసం నెట్‌గా చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు మాత్రమేనని అసెంబ్లీ వేదికగా ఆన్ రికార్డ్ వివరించానని తెలిపారు. తెచ్చిన అప్పులను మూలధనంగా మార్చి, ఎన్ని ఆస్తులు, ఎంత సంపద సృష్టించామో లెక్కలతో సహా చెప్పామన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ దేశంలోనే తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచిన విషయాన్ని ఎందుకు చెప్పడం లేదని హరీశ్ ప్రశ్నించారు. 'రాష్ట్రం దివాలా తీసిందన్న మీ మాటలు విని పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా వస్తారా? రాజకీయ కక్షల కోసం రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తారా? భావి తరాలకు శిక్ష వేస్తారా?'అని హరీశ్‌రావు నిలదీశారు. రాష్ట్ర ప్రతిష్టను కాపాడటం అంటే విదేశాలకు వెళ్లి ఇక్కడి డొల్ల కంపెనీల్లో బోగస్ పెట్టుబడులు పెట్టినంత సులువు కాదని ఎద్దేవా చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండే తెలంగాణ, మీ పాలనలో టాప్ పది స్థానంలో కూడా స్థానం దక్కించుకోలేకపోయిందని మండిపడ్డారు.

# వరద బాధితులకు ప్రభుత్వ సాయమేది?: బొత్స

విజయవాడ: బుడమేరు వరదల విషయంలో సీఎం చంద్రబాబు చెప్పిందే చెప్పి అబద్ధాన్ని నిజం చేయాలనుకుంటారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే వరదల వల్ల విజయవాడలో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలి. పత్రికల్లో ప్రకటనల కోసం కాకుండా బాధితులకు సాయం అందించటంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని అన్నారు. %మూడో దశ వరద సహాయక కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ ఇవాళ (మంగళవారం) శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా నిత్యావసర సరుకుల వాహనాలను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. " విజయవాడ ప్రాంతంలో వరద బాధితులకు సరుకుల పంపిణీ శ్రీకారం చుట్టాం. నిత్యావసర సరుకులను ప్రతిఇంటికి చేర్చాలని పార్టీ నిర్ణయించింది. బుడమేరు వరదల విషయంలో సీఎం చంద్రబాబు చెప్పిందే చెప్పి అబద్దాన్ని నిజం చేయాలకుంటారు. 2009లో ఈ ప్రాంతంలో వరదలు వచ్చిన సమయంలో ఆనాడు నేను మంత్రిగా ఉన్నా.. అప్పుడు బుడమేరకు వదర వస్తే.. తగు జాగ్రత్తలు తీసుకున్నాం. పైనఉన్న బ్యారేజీలు(శ్రీశైలం,నాగార్జున సాగర్,పులిచింతల)నుంచి కిందకి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాం. .. రేపల్లె సమీపంలో వరదలలో గండిపడితే నెల్లూరు కృష్ణపట్నం పోర్టు నుంచి 250 లారీలతో మట్టిని తెప్పించి పూడ్చాము. మా బాధ్యతగా అప్పడు మేము చేశాం. బుడమేరకు వరద వస్తుందని అధికారులకు ముందే తెలిసినా నిర్లక్ష్యంగా పట్టించుకోలేదని వారే మాట్లాడిన విషయాన్ని మనం వార్తల్లో చూశాం. వర్షాల విషయంలో వాతావరణ శాఖ ముందుగానే సూచించింది. ఈ ప్రభుత్వం వరదలపై ఎటువంటి మానిటరింగ్ చేయలేదు. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వానికి అసలు ఆలోచననే లేదు.

# ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ

ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ఇటీవల బెయిల్‌పై విడుదలైన సందర్భంగా సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ప్రజలు తాను నిజాయితీపరుడినని సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిని చేపట్టబోనని ఆయన ప్రతినబూనారు. ఎల్జీని కలుసుకున్న అనంతరం ఆతిశీ మీడియాతో మాట్లాడుతూ.. మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఎల్జీకి తెలిపామని, ఢిల్లీ ప్రజల ప్రయోజనాలను తాను పరిరక్షిస్తానని పేర్కొన్నారు. మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ.. అతిశీ నేతృత్వంలో కొత్త మంత్రివర్గం ప్రమాణం చేసేందుకు తేదీ ఖరారు చేయాల్సిందిగా ఎల్జీని కోరామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకొని తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నాయని ఆతిశీ ఆరోపించారు. కేజ్రీవాల్ కాకుండా మరొక నాయకుడైతే సీఎం కుర్చీని వదిలిపెట్టేవారు కాదని అన్నారు. కేజ్రీవాల్ ప్రజాకోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని, అందుకే రాజీనామా చేశారని చెప్పారు. ఇది తమకు ఎంతో బాధాకరమైన సమయం అని ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను తమ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని రాష్ట్ర ప్రజలు ప్రతినబూనారని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే మహారాష్ట్రతోపాటే నవంబర్‌లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించాలని కేజ్రీవాల్ కోరుతున్నారు.

# ఈ టర్మ్‌లోనే జమిలి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: ప్రస్తుత ప్రభుత్వ పాలనా కాలంలోనే జమిలి(ఒకేసారి దేశవ్యాప్త) ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి 100 రోజుల పాలనలో సాధించిన విజయాలపై మంగళవారం పత్రికాసమావేశంలో మంత్రి అశ్వనీవైష్ణవ్‌తో కలిసి అమిత్ సుదీర్ఘంగా మాట్లాడారు. జనగణన ఎప్పుడు జరపబోయేది త్వరలోనే వెల్లడిస్తామని, ప్రకటన చేశాక సంబంధిత వివరాలను తెలియజేస్తామని అమిత్ చెప్పా రు. జనగణన, కులగణన తక్షణం జరపాలంటూ విపక్షాల నుంచి విపరీతమైన డిమాండ్లు వెల్లువెత్తుతున్న తరుణంలో అమిత్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. "రైతాంగం బాగు కోసం సాగురంగంలో 14 విభాగాల్లో రూ.15 లక్షల కోట్ల విలువైన పథకాలను ఈ 100 రోజుల్లో అమల్లోకి తెచ్చాం. వ్యవసాయంలో మౌలిక వసతుల కల్పనకు మౌలిక సాగు నిధి ఏర్పాటుచేశాం. మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక తొలి నిర్ణయం రైతుల కోసమే తీసుకున్నారు. మెరుగైన మౌలిక వసతులకు రూ.3 లక్షల కోట్లు కేటాయించాం. 25వేలకు పైగా కుగ్రామాలకు రోడ్ల అనుసంధానం పెంచుతున్నాం. ఉల్లి, బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధరను తొలగించాం. వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు కట్టుబడ్డాం. ఆస్తుల దుర్వినియోగాన్నీ వక్ఫ్ (సవరణ) బిల్లు అడ్డుకుంటుంది. గత నెలలో లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టాం.





# ప్రజా సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు , సెప్టెంబర్ 17 ( డైలీ రిపోర్ట్):** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నారని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నేడు వాటి అమలుకు ప్రణాళిక అబద్ధం గా కృషి చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో ఆర్థిక అభ్యున్నతి చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నెలలో నూతన రేషన్ కార్డులు అందించబోతున్నామని తెలిపారు. చెరువులు కుంటలు ప్రభుత్వ భూముల సంరక్షణ కోసమే ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవజ, ఎమ్మార్వో రంగారావు, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమరవీరులకు నివాళు లర్పించిన ఫోరం ఫర్ బెటర్ సొసైటీ నాయకులు



**సంగారెడ్డి సెప్టెంబర్ 17 డైలీ రిపోర్ట్ :** తెలంగాణ విమోచన దినోత్సవము సందర్భంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన అమరవీరులకు నివాళులు అర్పించిన ఫోరమ్ నాయకులు.తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో ఐ బి వద్ద ఉన్న అమర వీరుల స్తూపం వద్ద నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన అమరులకు పూల మాల వేసి నివాళులు అర్పించిన ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు. ఈ సందర్భంగా ఫోరమ్ అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ,వేలాది మంది పోరాట వీరుల త్యాగల ఫలితంగా నాటి నిజాం పాలకులు హైదరాబాద్ నిజాం సంస్థానాన్ని భారత యూనియన్ లో విలీనం చేశారాని,నాటి నిజాం పాలనలో ప్రజలు కులాలకు మతాలకు అతీతంగా నిజాం నిరంకుశ పాలన వెట్టి చాకిరీ విముక్తి కోసం బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడి న వీరుల త్యాగం మరువలేనిదని అన్నారు. ఆనాటి పోరాట వీరుల స్ఫూర్తితో నేటి ప్రభుత్వాలు చేస్తున్న నియంత పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ప్రజా సమస్య ల మీద ప్రజా స్వామ్య యుత పోరాటలు చేయవల్సిన అవసరం ఉందని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఉపా అధ్యక్షులు సజ్జద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అమిది పురం మహేష్ కుమార్, సహా కార్యదర్శి పాండురంగం, కార్యవర్గ సభ్యులు సాయి వరాల తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు మరమ్మత్తులు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహకు

# వినతి పత్రం అందజేసిన షాపూర్ గ్రామ యువకులు



**రాయికోడ్,సెప్టెంబర్17(డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో ని రాయికోడ్ మండల షాపూర్ గ్రామనికి చెందిన యువకులు నేడు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సైన్సు అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి వర్యులను కలిసి మహాబాత్పూర్ నుండి పంపాండ్ వరకు గలా ఉన్న బిటి రోడ్డును గత 15 సంవత్సరల నుండి నేటి వరకు ఒక్కసారి కూడా కనీస మరమ్మతులు చేయలేరు షాపూర్ మరియు పంపాడు గ్రామాల్ల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మెయిన్ రోడ్డు వరకు వేళలి అంటే 5 కిలోమీటర్ల మేర ప్రయణమే కానీ కనీసం 30 నిమిషాల సమయం వరకు పడుతుంది దీని వల్ల నిత్యం ఆయా రూట్లో తిరిగే స్థానిక ప్రజలు నరకయాతన పడుతున్నము అన్ని యువకులు మంత్రి కి విన్నవించుకున్నారు. షాపుర్ గ్రామానికి చెందిన యువకులు మంత్రి కి వినతిపత్రం అందజేశారు .మంత్రి వారికి సానుకూలంగా స్పందించి త్వరలో మరమ్మతులు చెపిస్తాము అన్ని హామీ ఇవ్వడం జరిగింది.

# సంస్థాన్ శ్రీ వరసిద్ధి వినాయక లడ్డూ రూ. 2 లక్షల 51 వేలు



శంకర్‌పల్లి: సెప్టెంబర్ 17: (డైలీ రిపోర్ట్): గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డు చోరియా.. జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై..' అంటూ పెద్ద ఎత్తున గణపతి నిమజ్జన కార్యక్రమ ఊరేగింపు కొనసాగింది. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి మూడవ వార్డులో సంస్థాన్ శ్రీ వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డు వేలం పాటలో మొదటి లడ్డును ఆర్ గ్రూప్ సభ్యులు రూ. 2 లక్షల 51 వేలకు దక్కించుకున్నారు. రెండవ లడ్డును ఎల్ఐసి ఏజెంట్, మహిక సిల్వర్ షాపు యజమాని బచ్చు శ్రీధర్ రూ. 77 వేల 777 లకు దక్కించుకున్నారు. సంస్థాన్ శ్రీ వరసిద్ధి వినాయక ప్రెసిడెంట్ రంగనాథ్ చేతుల మీదుగా వేలంపాట విజేతలకు శాలువాలతో ఘనంగా సన్మానించి లడ్డూలను అందజేశారు. ఊరేగింపునకు ముందు పాటలు పాడుతూ భజనలు చేస్తూ నృత్యాలు చేస్తూ కేరింతలు కొడుతూ నిమజ్జన ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. మహిళల కోలాటం పలువురిని ఆకట్టుకుంది. ఊరేగింపు వాహనాలను ఎంతో అందంగా అలంకరించి మండపాల్లో పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనానికి తరలించి నిమజ్జనం చేశారు.

# లడ్డు వేలం పాట రూ. 2 లక్షల 22 వేల 222 నగదును అందజేసిన బిజెపి మున్సిపల్ ఇంచార్జ్ వాసుదేవ్ కన్నా, మన సంస్కృతి రెస్టారెంట్ యజమాని నరసింహారెడ్డి



**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 17: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి 13, 14 వార్డులలో వివేకానంద యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గత సంవత్సరం 2023లో వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో మొదటి లడ్డూను రూ. 2 లక్షల 22 వేల 222 లకు బిజెపి మున్సిపల్ ఇంచార్జ్ వాసుదేవ్ కన్నా, మన సంస్కృతి రెస్టారెంట్ యజమాని నరసింహారెడ్డిలు కలిసి లడ్డును కైవసం చేసుకున్నారు. రెండవ లడ్డును రిపోర్టర్ రాజశేఖర్ లక్ష 11 వేల 111 లకు కైవసం చేసుకున్నారు. మంగళవారం వినాయక నిమజ్జనం రోజున యువజన సంఘం సభ్యులకు వారు నగదును అందజేశారు. యువజన సంఘం సభ్యులు నగదును అందజేసిన వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసుదేవ్ కన్నా మాట్లాడుతూ హిందూ సాంప్రదాయ పరంగా ప్రజలంతా ఒకచోట కలిసి జరుపుకునే పండగ వినాయక చవితి అని, అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచే గణనాథునికి చల్లని ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో, పాడిపంటలతో ఉండాలని కోరుకున్నారు.

# ఘనంగా ముగిసిన రుద్రారం గణేష్ గడ్డ సిద్ధి వినాయక బ్రహ్మోత్సవాలు

## హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





పటాన్చెరు, సెప్టెంబర్ 17: పటాన్చెరు మండల పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవాలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, పల్లకి సేవ, రథోత్సవాన్ని ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి . గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. 11 రోజులపాటు స్వామి వారు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. హాజరైన సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, పాండు, నరసింహారెడ్డి, రాజు, హరి ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, వెంకన్న, ఆలయ ఈవో శశిధర్, స్థానిక నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం

### ముఖ్య అతిథులుగా భేల్ జనరల్ మేనేజర్ ఫణి కుమార్,

### భారతీ నగర్, రామచంద్రపురం కార్పొరేటర్ లు హాజరు..

### అన్న సమారాధనలో దాదాపు 1500 మంది భక్తులు





**సంగారెడ్డి సెప్టెంబర్ 17 (డైలీ రిపోర్ట్):** శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం మరియు జయంతి ఉత్సవం మంగళవారం విశ్వకర్మ దేవాలయం బెల్ టౌన్షిప్ రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భేల్ ఎంప్లాయిస్ మరియు వేలాది మంది భక్తులు యజ్ఞ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపను పొందారు.టెంపుల్ కార్యవర్గం ఏర్పాటు చేసిన అన్న సమరాధనలో దాదాపు 1500 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టెంపుల్ ప్రెసిడెంట్ మరియు భేల్ జనరల్ మేనేజర్ శ్రీ యు ఫణి కుమార్, వైస్ ప్రెసిడెంట్ శశికిరణ్ ,సెక్రటరీ మాయ బ్రహ్మ, అభయ్ కుమార్ సాహూ, శ్రీనివాసచారి మరియు కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి దంపతులు రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్ దంపతులు పాల్గొన్నారు కె వి ప్రసాద్ దేవేంద్ర చారి విష్ణుమూర్తి ప్రభాకర్ బ్రహ్మం చంద్రయ్య పాల్గొని స్వామివారి కృపకు పాతురాలైనారు.



# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

జిల్లా పోలీసులకు ప్రజలకు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.

1948 సెప్టెంబర్ 17 నిజాం నిరంకుశ పాలన నుండి విడుదలైన ఒకప్పటి హైదరాబాద్ రాష్ట్రం.

క్యాంపు కార్యాలయం నందు జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ.





**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఆదిలాబాద్ జిల్లాలో అన్ని పోలీసు కార్యాలయాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈరోజు ఉదయం 9 గంటలకు జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం నందు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటగా ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించి, పోలీసు గౌరవ వందనాల నడుమ జాతీయ పతాకాన్ని సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హైదరాబాద్ రాష్ట్రం 1948 సెప్టెంబర్ 17వ తారీఖున భారత దేశ యూనియన్ నందు విలీనమైన సందర్భంగా ఈ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నేటితో 77 సంవత్సరములు పూర్తి చేసుకొని తెలంగాణ రాష్ట్రం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించు కోవడం జరుగుతున్నది. ప్రతి ఒక్కరికి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తెలంగాణ సాధించడానికి కృషి చేసిన మహనీయుల పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు అదనపు ఎస్పి ఆపరేషన్ బి సురేందర్రావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. జిల్లా సాయుధ దళం నందు రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్నవిష్కరించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లు కార్యాలయాలలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, బి సురేందర్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా పోలీస్





- పూర్తి అప్రమత్తమై నిమజ్జన విధులను నిర్వర్తించాలి.
- కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలి
- జిల్లా వ్యాప్తంగా గణపతి నిమర్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు.
- సిబ్బంది కి సూచనలు ఇచ్చిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.



**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో::** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రులలో కీలకమైన 11వ రోజు రావడంతో ఆదిలాబాద్ పట్టణంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఈరోజు స్థానిక ఎస్టియు భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బంది చేయవలసిన విధులపై సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈరోజు సాయంత్రం మొదలు బుధవారం మధ్యాహ్నం వరకు గణపతి నిమర్జనం కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. చివరి గణపతి నిమర్జనం అయ్యేంతవరకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలో జరగకుండా సెక్టర్ క్లస్టర్ అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. 1000 మంది పోలీసు సిబ్బందికి అదనంగా 200 సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీ లతో ప్రత్యేక నిఘా. 250 మంది ట్రైన్ కానిస్టేబుల్ తో అదనపు బందోబస్తు. అంబేద్కర్ చౌక్, వినాయక చౌక్ నందు ప్రత్యేక కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు. అడుగడుగునా పోలీస్ సిబ్బంది గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు విధులను నిర్వర్తిస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, బి సురేందర్ రెడ్డి, జిల్లా పోలీసు సిఐలు ఎస్సైలు రిజర్వేషన్ సిబ్బంది ట్రైనింగ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్స్ హౌసింగ్ అండ్ హౌస్ సైట్స్ కమిటీ మెంబర్ గా అన్వర్ హుస్సేన్

**సంగారెడ్డి సెప్టెంబర్ 17,(డైలీ రిపోర్ట్):** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల కార్యవర్గ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ యూనియన్ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి, దేవులపల్లి అమర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ, రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. సమావేశంలో వివిధ రాష్ట్ర స్థాయి అనుబంధ కమిటీలను కార్యవర్గం ఆమోదించింది. సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ అన్వర్ హుస్సేన్ జర్నలిస్టుల హౌసింగ్ మరియు హౌస్ సైట్స్ రాష్ట్ర స్థాయి కమిటీలో సభ్యుడిగా నామినేట్ చేస్తూ కార్యవర్గం ఆమోదం తెలిపింది రాష్ట్ర కమిటీ సభ్యులు గా ఎన్నికైన అన్వర్ హుస్సేన్‌ను, రాష్ట్ర ఉపాధ్యక్షులు, MAK ఫైసల్, జిల్లా అధ్యక్షులు (TUWJ) యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి (TUWJ) విష్ణులు అభినందించారు.



## స్వచ్ఛత హి సేవ కార్యక్రమం

**శంకర్పల్లి సెప్టెంబర్ 17: (డైలీ రిపోర్ట్):** పురపాలక సంఘం శంకర్పల్లి పరిధిలో నేడు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సింగపూర్ టవర్ యందు స్వచ్ఛత ప్రతిజ్ఞ మరియు మానవహారం మరియు గ్రామ సభ నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో గౌరవ చైర్పర్సన్ వైస్ చైర్పర్సన్ మున్సిపల్ కమిషనర్ కౌన్సిల్ సభ్యులు కో ఆప్షన్స్ సభ్యులు మరియు మున్సిపల్ సిబ్బంది పుర ప్రజలు పాల్గొనడం జరిగింది.

## కొండకల్ శివాజీ సేన ఆద్వర్యం లో అన్నదాన కార్యక్రమం

శంకరపల్లి : సెప్టెంబర్ 17:(డైలీ రిపోర్ట్ ): శంకరపల్లి మండల పరిధి కొండకల్ గ్రామ శివాజీ సేన గణపయ్య కి ఘనంగా పూజలు జరుగుతున్నాయి . పది రోజులు నిష్టతో పూజ చేసిన శివాజీ సేన సభ్యులు మంగళవారం అన్నదాన కార్యక్రమం చేసారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా గ్రామ మాజీ సర్పంచ్ లావణ్య కాశీనాథ్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి భారతీయుల అతిముఖ్య పండుగలలో ఇది ఒక పండగ. పార్వతి, పరమేశ్వరుల కుమారుడైన వినాయకుని పుట్టినరోజునే వినాయక చవితిగా జరుపుకుంటారు. భాద్రపదమాసం శుక్ల చతుర్థి మధ్యాహ్న శుభ సమయంలో హస్త నక్షత్రం రోజున చవితి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. హిందూధర్మశాస్త్రాలు ప్రతిరోజూ వేద శ్లోకాలు , ప్రార్థనలు, పూజలు జరుగుతాయి అని వివరించారు .ఈ కార్యక్రమం లో శివాజీ సేన సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు .





## శంకర్‌పల్లిలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

జాతీయ జెండాలను ఎగురవేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకయ్య గౌడ్



శంకర్‌పల్లి: సెప్టెంబర్ 17: (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో వెంకయ్య గౌడ్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ జాతీయ జెండాలను ఎగరవేసి సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిని గుర్తు చేస్తూ చెడుపై పోరాటం చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరుల కుటుంబ సభ్యులకు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుంచి దేశ ప్రజలకు విముక్తి కలిగింది కానీ తెలంగాణ ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కలగలేదన్నారు. మాజీ ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.తెలంగాణ స్వతంత్ర భారతదేశంలో విలీనమైనఈ రోజును తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించుకోవడం సంతోషకరమని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, తహశీల్దార్ సురేందర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.










# ప్రజాపాలన దినోత్సవంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి సెప్టెంబర్ 17,(డైలీ రిపోర్ట్):** ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండా ను ఆవిష్కరించిన రాష్ట్ర వైద్య ,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి తదుపరి అమరవీరుల స్థూపానికి పూల గుచ్చాలను సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం, జిల్లా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలన వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు స్వాతంత్ర సమరయోధులందరికీ జోహార్లు అర్పించారు.హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో చేరి నేటికీ 77 వ సంవత్సరంలోకి అడుగుడుతున్న సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, అనధికారులకు, పాత్రికేయులకు, ఉద్యమకారులకు, కార్మిక, కర్షక , విద్యార్థినీ, విద్యార్థులకు, జిల్లా ప్రజలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**సంగారెడ్డి సెప్టెంబర్ 17,(డైలీ రిపోర్ట్):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం" సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో చెన్నూరి రూపేష్ ఐపియస్., జాతీయ జెండాను ఆవిష్కరించి, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలపన చేసి, గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు అధికారులకు, సిబ్బందికి మరియు జిల్లా ప్రజలందరికి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. 1947 ఆగస్టు 15న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలోనే ఉండేది. ఆనాటి కేంద్ర హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి నేతృత్వంలో నిర్వహించిన ఆపరేషన్ పోలో విజయవంతమై, 1948 సెప్టెంబర్ 17 సాయంత్రం 5 గంటలకు మీర్ ఉస్మాన్ అలీఖాన్ రేడియో ద్వారా ఉపన్యాసం ఇస్తూ హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో అంతర్భాగం అని ప్రకటించారన్నారు. అప్పటి వరకు నిజాం నిరంకుశ పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడం జరిగింది. కావున ఈ రోజును మనం "తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం" గా జరుపుకుంటున్నాం అన్నారు. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు ఏ విధంగానైతే సమాజ సేవ చేయాలని ఉత్సాహంగా విధులలో చేరామో, అదే ఉత్సాహం చివరి వరకు కొనసాగించాలన్నారు. తమకు కేటాయించిన విధిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే దేశానికి సేవ చేసినవారం అవుతామని, ప్రతి ఒక్కరు తమ విధిని శ్రద్ధగా, అంకిత భావంతో నిర్వర్తించి, దేశ సేవలో ముందుండాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు.ఎస్పీ ఎ. సంజీవరావ్, సంగారెడ్డి డి.యస్.పి. సత్తయ్య గౌడ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇ.కళ్యాణి, యస్.బి. ఇన్స్పెక్టర్ విజయకృష్ణ, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ బి.రమేష్, ఐ.టి. ఇన్స్పెక్టర్ రమేష్ ఆర్.ఐ.లు రామరావ్, డానియోల్, యస్.బి., డి.సి.ఆర్.బి. యస్.ఐ.లు సూపరింటెండెంట్ లు అశోక్, వెంకటేశం, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక లడ్డు వేలం పాట



## మొదటి లడ్డు రూ.1 లక్ష 75 వేలు
## రెండవ లడ్డు రూ.1 లక్ష 10వేలు
## మూడవ లడ్డు రూ.50 వేలు

**పటాన్ చెరు, సెప్టెంబర్17 (డైలీ రిపోర్ట్):** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పటాన్చెరు మండలం రుద్రారం గ్రామం గణేష్ గడ్డ స్వయంభుగా వెలసిన శ్రీ సిద్ధి వినాయక ఆలయంలో గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల భాగంగా చివరిరోజైనా మంగళవారం వినాయకుడి మూడు లడ్డులను వేలంపాట వేశారు. వేలంపాటలో మూడు లడ్డులకు గాను రూ.3 లక్షల 35వేలకు భక్తులు దక్కించుకున్నారు. మొదటి లడ్డు గడ్డమీది నవీన్ రూ.1 లక్ష 75 వేలు, రెండవ లడ్డు రాయచూరు శ్రీవాణి వేణుగోపాల్, ఓడిఎఫ్ వెంకటేశం, రూ.1 లక్ష 10వేలు, మూడవ లడ్డు గడ్డమీది కుమార్ రూ.50 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. వేలంపాటలో వినాయకుడి లడ్డులను దక్కించుకున్న ముగ్గురు భక్తులకు ఆలయ సిబ్బంది స్వామి వారి దర్శనం చేయించి, వారిని సన్మానించి లడ్డులను అందజేశారు. స్వామివారి లడ్డును దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. వినాయకుడి కృప, ఆశీస్సులతో తమ కుటుంబ సభ్యులతో పాటు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఆలయ ఇంచార్జి ఈవో శశిధర్, జూనియర్ అసిస్టెంట్లు ఈశ్వర్, సోమేశ్వర్, సిబ్బంది, అర్చకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# 'హైడ్రా' పేరుతో కాంగ్రెస్ హడావుడి: తమ్మినేని వీరభద్రం

హన్మకొండజిల్లా:కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో హడావుడి చేస్తోందని సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.హన్మకొండలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభకు తమ్మినేని మంగళవారం(సెప్టెంబర్17) హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ'రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా అమలు చేయాలి.పేద,మధ్య తరగతి ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాలి.కాంగ్రెస్ ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి.పేదలకు భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్ట్ లది.చట్టాలు చేసి మోసం చేసిన చరిత్ర ప్రభుత్వాలది. కేసీఆర్ పదేండ్లలో 16వేల ఎకరాలు మాత్రమే పంచారు. ప్రస్తుతం 16లక్షల మంది భూమి కోసం ఎదురు చూస్తున్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసేది కమ్యూనిస్ట్ లే.చరిత్ర ను వక్రీకరించి తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముస్లిం, హిందూ పోరాటంగా బీజేపీ చిత్రీకరిస్తోంది.తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఎవరు ఎన్ని కుట్రలు చేసినా చెరపలేరు'అని తమ్మినేని అన్నారు.



## గణేష్ నిమజ్జనంలో విషాదం.. చెరువులో జారిపడి యువకుడి మృతి

యాదాద్రి భువనగిరి: వినాయకుడి నిమజ్జనంలో విషాదం చోటు చేసుకుంది. చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ విషాదకరస సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం జిబ్లక్ పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు గణేషుడిని చెరువులో నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతి చెందాడు. ప్రవీణ్ మృతదేహం వెలికి తీసేందుకు చర్యలు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707